ఆసీస్‌దే ఆధిక్యం

పెర్త్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొడుతున్న ఆస్ట్రేలియా.. పాకిస్థాన్‌తో జరుగుతున్న తొలి టెస్టుపై పట్టు బిగించింది. ఓవర్‌నైట్ స్కోరు 132/2తో మూడోరోజు ఆట కొనసాగించిన పాకిస్థాన్.. 271 పరుగులకు ఆలౌటైంది. ఇమామ్ (62) టాప్ స్కోరర్.ఆసీస్ బౌలర్లలో లియాన్ 3, స్టార్క్ రెండు వికెట్లు పడగొట్టారు. అనతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కంగారూలు.. శనివారం ఆట ముగిసే సమయానికి 2 వికెట్లు కోల్పోయి 84 పరుగులు చేసింది.ఉస్మాన్ ఖవాజా (34), స్మిత్ (43) క్రీజులో ఉన్నారు. పాక్ బౌలర్లలో షహజాద్ రెండు వికెట్లు పడగొట్టాడు. చేతిలో 8 వికెట్లు ఉన్న ఆసీస్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కలుపుకొని ఓవరాల్‌గా 300 పరుగుల ముందంజలో ఉంది.

నాలుగుతో సరి

కౌలాలాంపూర్: పురుషుల జూనియర్ హాకీ ప్రపంచకప్‌లో భారత్‌కు నిరాశ తప్పలేదు. శనివారం కాంస్య పతక పోరులో భారత్ 1-3తో స్పెయిన్ చేతిలో ఓటమి పాలైంది. భారత్ తరపున సునీల్ జోజో (28వ నిమిషంలో) ఏకైక గోల్ చేయగా.. స్పెయిన్ తరపున నికోలస్ అల్వారెజ్ (25వ, 51వ. ని.ల్లో), పాచెమ్ పా (40వ ని.లో) గోల్స్ కొట్టారు. లీగ్ స్టేజ్‌లో స్పెయిన్ చేతిలో పరాజయం పాలైన భారత్.. కీలక పోరులోనూ సత్తాచాటలేకపోయింది.

ఖేలో ఇండియా పారా టేబుల్ టెన్నిస్ టోర్నీలో తెలంగాణ ప్యాడ్లర్ హితేశ్ ఫైనల్‌కు చేరాడు.

వన్డే వార్

మధ్యాహ్నం 1.30 నుంచి

నేడు భారత్, దక్షిణాఫ్రికా తొలి వన్డే

వన్డే ప్రపంచకప్ ఫైనల్ పరాజయం అనంతరం తొలిసారి భారత జట్టు ఈ ఫార్మాట్‌లో బరిలోకి దిగేందుకు సిద్ధమైంది. రోహిత్, కోహ్లీ, బుమ్రా గైర్హాజరీలో కేఎల్ రాహుల్ జట్టును నడిపించనున్నాడు. సఫారీ టూర్‌లో టీ20 సిరీస్‌ను సమం చేసుకున్న టీమ్‌ఇండియా.. 50 ఓవర్ల ఫార్మాట్‌లో రాణించాలని చూస్తుంటే.. సొంతగడ్డపై సత్తాచాటాలని ప్రొటీస్ తహతహలాడుతున్నది. నయా ఫినిషర్ రింకూసింగ్ వన్డే అరంగేట్రం చేయడం దాదాపు ఖాయమే!

జొహన్నెస్‌బర్గ్: సొంతగడ్డపై భారీ అంచనాల మధ్య బరిలోకి దిగి వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లో పరాజయం పాలైన టీమ్‌ఇండియా.. ఆ ఓటమిని పక్కన పెట్టి 50 ఓవర్ల సమరాన్ని కొత్తగా ప్రారంభించేందుకు రెడీ అయింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆదివారం భారత్, దక్షిణాఫ్రికా మధ్య తొలి వన్డే జరగనుంది. మెగాటోర్నీ తర్వాత ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాతో టీ20 సిరీస్‌ల్లో తలపడ్డ భారత్.. తొలిసారి వన్డే ఫార్మాట్‌లో ఆడనుంది. వరల్డ్‌కప్ తర్వాత విశ్రాంతి తీసుకున్న కేఎల్ రాహుల్ ఈ సిరీస్‌కు భారత సారథిగా వ్యవహరించనుండగా.. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, జస్ప్రీత్ బుమ్రా అందుబాటులో లేరు. గతంలో దక్షిణాఫ్రికాలో జరిగిన వన్డే సిరీస్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు దక్కగా.. ఈ సారి ఆధిపత్యం కనబర్చాలని టీమ్‌మేనేజ్‌మెంట్ యోచిస్తున్నది. రుతురాజ్ గైక్వాడ్‌తో పాటు, సాయి సుదర్శన్ ఓపెనింగ్ చేయనుండగా.. తెలంగాణ కుర్రాడు తిలక్ వర్మ మూడో స్థానంలో బ్యాటింగ్ చేయనున్నాడు. మిడిల్‌ఆర్డర్‌లో శ్రేయస్ అయ్యర్, రాహుల్ బరిలోకి దిగనుండగా.. సీనియర్ ప్లేయర్ సంజూ శాంసన్ స్థానంలో నయా ఫినిషర్ రింకూసింగ్‌ను ఆడించే అవకాశాలే ఎక్కువ. స్పిన్నర్ల కోటాలో కుల్దీప్‌తో పాటు అక్షర్ జట్టులో చోటు దక్కించుకోనుండగా.. ముఖేశ్ కుమార్, అవేశ్‌ఖాన్, అర్ష్‌దీప్ సింగ్ పేస్ భారాన్ని మోయనున్నారు. టీ20 సిరీస్‌లో ఆడిన పలువురు ఆటగాళ్లను ఈ సిరీస్ నుంచి విశ్రాంతి కల్పించారు. మరోవైపు సొంతగడ్డపై టీ20 సిరీస్ గెలువలేకపోయిన దక్షిణాఫ్రికా వన్డేల్లోనైనా సత్తాచాటాలని చూస్తున్నది. రెగ్యులర్ కెప్టెన్ టెంబా బవుమాకు ఈ సిరీస్ నుంచి విశ్రాంతి నివ్వగా.. మార్క్‌రమ్ జట్టును నడిపించనున్నాడు. అతడితో పాటు హెన్రిక్స్, డసెన్, క్లాసెన్, మిల్లర్, ఫెలుక్వాయోతో దక్షిణాఫ్రికా జట్టు పటిష్టంగా ఉంది.

తుది జట్లు (అంచనా)

భారత్: రాహుల్ (కెప్టెన్), రుతురాజ్, సాయి సుదర్శన్, తిలక్, శ్రేయస్, రింకూసింగ్/సంజూ శాంసన్, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, అవేశ్ ఖాన్, కుల్దీప్ యాదవ్, ముఖేశ్.

దక్షిణాఫ్రికా: మార్క్‌రమ్ (కెప్టెన్), హెన్రిక్స్, జోర్జీ, డసెన్, క్లాసెన్, మిల్లర్, ఫెలుక్వాయో, ముల్డర్, బర్గర్, కేశవ్ మహరాజ్, లిజాడ్ విలియమ్స్.

పిచ్, వాతావరణం

వాండరర్స్ పిచ్ బ్యాటింగ్ అనుకూలం. ఇక్కడ గతంలో జరిగిన మ్యాచ్‌ల్లో భారీ స్కోర్లు నమోదయ్యాయి. గత నాలుగు మ్యాచ్‌ల్లో మూడుసార్లు మొదట బ్యాటింగ్ చేసిన జట్టు మూడొందల పైచిలుకు స్కోరు చేసింది. మ్యాచ్‌కు వర్షం ముప్పులేదు.

షమీ దూరం

మంబై: సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ.. దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌కు దూరమయ్యాడు. వన్డే ప్రపంచకప్‌లో తన అద్వితీయమైన ప్రదర్శనతో అదరగొట్టిన షమీ.. గతంలోనే సఫారీ టూర్‌కు ఎంపికైనా.. గాయం కారణంగా టెస్టు సిరీస్‌కు అందుబాటులో లేకుండాపోయాడు. చిలమండ గాయం పూర్తిగా తగ్గకపోవడంతో.. బీసీసీఐ వైద్య బృందం షమీకి క్లియరెన్స్ ఇవ్వలేదు. మరోవైపు పేస్ ఆల్‌రౌండర్ దీపక్ చాహర్ వ్యక్తిగత కారణాల వల్ల వన్డే సిరీస్ నుంచి తప్పుకున్నాడు. అతడి స్థానంలో సీనియర్ సెలెక్షన్ కమిటీ బెంగాల్ పేసర్ ఆకాశ్‌దీప్‌ను జట్టుకు ఎంపిక చేసింది.

అమ్మాయిలు అదరహో..

- 347 పరుగులతో ఇంగ్లండ్ చిత్తు
- దీప్తి ఆల్‌రౌండ్ మెరుపులు

భారత మహిళల క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. ఇంగ్లండ్ చేతిలో పొట్టి సిరీస్ పరాజయాన్ని మరిపిస్తూ.. టెస్టు క్రికెట్‌లో విశ్వరూపం కనబర్చింది. బ్యాటర్ల విజృంభణకు బౌలర్ల సహకారం తోడవడంతో టీమ్‌ఇండియా 347 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. మహిళల టెస్టు క్రికెట్‌లో ఇదే అతిపెద్ద విజయం.

1 మహిళల టెస్టు క్రికెట్ చరిత్రలో పరుగుల పరంగా ఇదే (347 రన్స్ తేడాతో) అతిపెద్ద విజయం 1998లో పాకిస్థాన్‌పై 309 పరుగులతో గెలిచిన శ్రీలంక రెండో స్థానంలో ఉంది.

మహిళల క్రికెట్ చరిత్రలో అతిపెద్ద విజయం నమోదు

ముంబై: సొంతగడ్డపై చాన్నాళ్ల తర్వాత ఆడిన టెస్టులో భారత అమ్మాయిలు అదరగొట్టారు. మూడు రోజుల్లోనే ముగిసిన ఏకైక టెస్టులో హర్మన్‌ప్రీత్ బృందం 347 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను మట్టికరిపించింది. ఓవర్‌నైట్ స్కోరు 186/6 వద్దే రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసిన భారత అమ్మాయిలు.. ఇంగ్లండ్ ముందు 479 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించారు. కొండంత ఛేదనలో ఇంగ్లండ్ 131 పరుగులకు ఆలౌటైంది. శనివారం ఒక్క సెషన్ కూడా పూర్తిగా బ్యాటింగ్ చేయలేకపోయిన ఇంగ్లండ్ మహిళల జట్టు 27.3 ఓవర్లలో చాపచుట్టేసింది. కెప్టెన్ హీతర్ నైట్ (21) టాప్ స్కోరర్. భారత బౌలర్లలో దీప్తి శర్మ 4, పూజ వస్త్రాకర్ మూడు వికెట్లు పడగొట్టారు. రెండో ఇన్నింగ్స్‌ల్లో కలిపి 97 పరుగులు చేయడంతో పాటు 9 వికెట్లు పడగొట్టిన దీప్తి శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

సంక్షిప్త స్కోర్లు: భారత్ తొలి ఇన్నింగ్స్: 428; ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 136; భారత్ రెండో ఇన్నింగ్స్: 186/6 డిక్లేర్డ్; ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: 131 (హీథర్ 21; దీప్తి 4/32, పూజ 3/23).

శ్రీధర్ డబుల్ ధమాకా

హైదరాబాద్, ఆట ప్రతినిధి: పారా ఖేలో ఇండియా టోర్నీలో తెలంగాణ షూటర్ ఆర్ జనార్ధన్ శ్రీధర్ డబుల్ ధమాకా మోగించాడు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఆర్4 విభాగంలో రజతం నెగ్గిన శ్రీధర్.. ఆర్ 5 విభాగంలో కాంస్య పతకం ఖాతాలో వేసుకున్నాడు. ఈ ప్రదర్శనతో వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పారా షూటింగ్ ప్రపంచకప్‌నకు శ్రీధర్ అర్హత సాధించాడు.

హజారే హర్యానాదే!

ఫైనల్లో రాజస్థాన్‌పై ఘనవిజయం

రాజ్‌కోట్: దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీని హర్యానా చేజిక్కించుకుంది. శనివారం హోరాహోరీగా సాగిన ఫైనల్లో హర్యానా 30 పరుగుల తేడాతో రాజస్థాన్‌ను చిత్తుచేసింది. మొదట బ్యాటింగ్ చేసిన హర్యానా నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 287 పరుగులు చేసింది. అంకిత్ కుమార్ (88), కెప్టెన్ అశోక్ మనేరియా (70) అర్ధశతకాలతో రాణించగా.. రాహుల్ తెవాటియా (24; 3 ఫోర్లు, ఒక సిక్సర్), సుమిత్ కుమార్ (28 నాటౌట్; 4 ఫోర్లు, ఒక సిక్సర్) ఆఖర్లో వేగంగా ఆడారు. రాజస్థాన్ బౌలర్లలో అనికేత్ చౌదరి 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం లక్ష్యఛేదనలో రాజస్థాన్ 48 ఓవర్లలో 257 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ అభిజిత్ తోమర్ (106; 10 ఫోర్లు, 2 సిక్సర్లు), కునాల్ సింగ్ (79; 4 ఫోర్లు, 5 సిక్సర్లు) పోరాడారు. హర్యానా బౌలర్లలో హర్షల్, సుమిత్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.